క్లుప్తంగా

బహిరంగ వేలం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి దేవస్థాన గోశాల ఎరువును వేలం ద్వారా సోమవారం విక్రయించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కామినేని తిరుపతి నాయుడు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ గోపీ మాట్లాడారు. గోశాలలో ఎరువు విక్రయాల ద్వారా రూ.52 వేల ఆదాయం సమకూరిందని చెప్పారు. సుధీర్ పాల్గొన్నారు.

సహకార వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు రూరల్: సహకార వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో డీసీఓ గుర్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అన్ని సహకార సంఘాల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నారని వివరించారు. డీఆర్వో ఉదయ్‌భాస్కర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అవెన్యూ స్కూల్‌కు చెందిన దక్షిత, ఆదిత్య హనుమా ద్వితీయ, ఎనిమిదో స్థానాల్లో నిలిచారని కరస్పాండెంట్ కృష్ణచైతన్య తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ శ్వేతసంధ్య పాల్గొన్నారు.

అబుల్ కలామ్‌కు నివాళి



నెల్లూరు(అర్బన్): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు రియాజ్, షబ్బీర్, ఫయాజ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీని కాపాడుకుందాం



ధర్నా చేస్తున్న ఏజెంట్లు

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీ సంస్థను కాపాడుకుందామని ఏఓఐ ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్, సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు పేర్కొన్నారు. ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ ఏఓఐ ఆధ్వర్యంలో దర్గామిట్టలోని సంస్థ డివిజనల్ కార్యాలయం వద్ద ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ఏజెంట్లు ధర్నాను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఐసీలోని 14 లక్షల మంది ఏజెంట్లకు తొలిసారిగా ఏడు శాతం కమీషన్‌కు కోత విధించారని ఆరోపించారు. ఏఓఐ డివిజన్ అధ్యక్షుడు శివయ్య, ఏపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, సీఐటీయూ నేతలు నగేష్, బలరామ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు సిటీ: అల్లీపురంలోని పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సోమవారం చేపట్టారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై ఆరోగ్యసిబ్బంది రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్యపరీక్షలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌లో వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు క్షయ రోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు కొల్లి హజరత్‌రెడ్డి, డాక్టర్ బలరామ్‌నాయక్ పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యత పరిశీలన



నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని రోడ్ల నాణ్యతను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొద్ది రోజులుగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని పొదలకూరు రోడ్డును విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో ఆర్ అండ్ బీ అధికారులు సోమవారం పరిశీలించారు. రోడ్డు పనుల నాణ్యతను తెలుసుకునేందుకు గానూ నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. విజిలెన్స్ డీఈఈ మమత, ఏఈఈ అవినాష్‌రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారులు, సిబ్బంది సురేష్, శివకృష్ణ పాల్గొన్నారు.

కార్తీక శోభ





నెల్లూరు(బృందావనం): పవిత్ర కార్తీక మాస రెండో సోమవారాన్ని పురస్కరించుకొని ముక్కంటి నిలయాలు ఓం నమఃశివాయ నామస్మరణతో పులకించాయి. ఆలయాల్లో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, విశేష పూజలు తదితరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక దీపాలను భక్తులు వెలిగించి ప్రణమిల్లారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గల మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయం తదితరాల్లో విశేష పూజలను నిర్వహించారు.





మూలస్థానేశ్వరాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కరూర్ వైశ్య బ్యాంక్ శాఖ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు ఎన్సీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కరూర్ వైశ్య బ్యాంక్ శాఖను కమిషనర్ సూర్యతేజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో మూడో శాఖను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ అనూష, బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, మేనేజర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు ఘన సన్మానం



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పలువురు అభినందనలను సోమవారం తెలియజేశారు. మినీబైపాస్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. పరిచయ కార్యక్రమాన్ని పార్టీ నేత కల్లూరి లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య, ఎమ్మెస్మేఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, హరిబాబుయాదవ్, పార్టీ యూత్ జిల్లా ప్రెసిడెంట్ మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, ఉడతా మురళీయాదవ్, హంషీద్ అలీ, వైవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ట్రైయినీ ఐఏఎస్‌లు



నెల్లూరు(బృందావనం): అర్బన్ ఫీల్డ్ విజిట్‌లో ఉన్న పది మంది ట్రైయినీ ఐఏఎస్‌లు కమిషనర్ సూర్యతేజను మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరుగుతున్న వివిధ కార్యకలాపాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



నెల్లూరు రూరల్: సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత పద్మశాలి సంఘ, జిల్లా కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. గాంధీనగర్‌లోని 6.9 సెంట్లను చేనేత వర్గాలకు కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ రాధయ్య, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, సభ్యులు రామనాథం, రాజశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, అఖిల భారత పద్మశాలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి చింతగింజల సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వేణుగోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలను వైఖానస ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు నేతృత్వంలో ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు నిర్వహించారు. గోపూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా కాకాణి నరహరిరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈఓ గోపీ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ఉన్నతికి విద్య తప్పనిసరి

- కలెక్టర్ ఆనంద్



అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆనంద్ తదితరులు

నెల్లూరు రూరల్: కుటుంబం ఉన్నతంగా ఎదగాలంటే విద్య తప్పనిసరని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో సోమవారం నిర్వహించారు. అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ సేవలను అందించిన ఉపాధ్యాయులు, ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. మేయర్ స్రవంతి, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్ భాస్కర్, ప్రధానమంత్రి 15 సూత్రాల కమిటీ సభ్యుడు ఎలీషాకుమార్, మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, సురేంద్రబాబు పాల్గొన్నారు.

సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాలో భూ సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, భూసేకరణ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రేషన్, ఆధార్, పింఛన్లపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. గ్రామస్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చుక్కల భూములకు సంబంధించిన రీ వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం భూసేకరణ చేసిన రైతులకు నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశించారు. జిల్లాలో మాజీ సైనికులకు ప్రభుత్వ నిబంధనల మేరకు భూములను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో చేపట్టిన పనులను జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగాభవానీ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ రెండో డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం శివకేశవ్‌యాదవ్‌కు ఒకరు ఫోన్ చేసి సమస్యను తెలియజేశారు. నెల్లూరు నుంచి అనంతపురానికి స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సును నడపాలని నగరానికి చెందిన రామ్ కోరారు. కాగా ఈ అంశం జోన్ – 4 పరిధిలోకి వస్తుందని, అయినా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎం చెప్పారు.

- డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నామని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. 99592 25641 నంబర్‌ను సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు సంప్రదించి సూచనలు, సలహాలివ్వాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

నెల్లూరు సిటీ: జీపీడీపీ – బీపీడీపీపై రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులకు మంగళ, బుధవారాల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, కందమూరు, ఉప్పుటూరు, సౌత్‌మోపూరు, ఆమంచర్ల, దొంతాలి గ్రామాల్లో మంగళవారం.. ములుమూడి, కొమ్మరపూడి, దేవరపాళెం, పొట్టేపాళెం, కాకుపల్లి బిట్ – 1, మాదరాజుగూడూరు, పెనుబర్తి, కలివెలపాళెంలో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభంకానున్నాయని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వ్యక్తి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. రంగనాథస్వామి ఆలయ వెనుకవైపు గల పెన్నాలో దూకి గత నెల నాలుగున చిన్నకుమార్తె ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన ఆయన ఎవరితోనూ సక్రమంగా మాట్లాడేవారు కారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఆదివారం రాత్రి నిద్రించిన ఆయన, సోమవారం ఉదయానికి అదృశ్యమయ్యారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్సై ముత్యాలయ్య దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ టెండర్లు ఓపెన్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితులు పెంచిన జామాయిల్‌ను నరికి విక్రయించేందుకు వీలుగా ఆన్‌లైన్లో ఆహ్వానించిన టెండర్లను డీఎఫ్ఓ మహబూబ్‌బాషా సోమవారం తెరిచారు. ఎనిమిది మంది బిడ్లు వేయగా, వీరిలో నలుగురు అర్హత సాధించారు. టన్ను జామాయిల్ కర్రకు అధికంగా రూ.8100 టెండర్‌ను జిల్లాకు చెందిన ప్రతిష్ట ట్రేడర్స్ సంస్థ అధినేత శ్రీనివాసులు వేశారు. ఈయన ప్రథమ స్థానంలో ఉండటంతో కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. జిల్లాలో 1,02,487 మెట్రిక్ టన్నుల జామాయిల్ ఉందని అంచనా వేశారు. జామాయిల్ కర్రను వచ్చే ఏడాది మార్చిలోపు నరికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. గుంటూరు స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతిప్రసాద్, జిల్లా సామాజిక అటవీశాఖ అధికారి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదుగానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అయ్యప్పగుడి ఫ్లైఓవర్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై సోమవారం చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. తెలుపు, నలుపు రంగు గళ్లు గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు, బ్లూ రంగు గళ్ల లుంగీని ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు తెలియజేసిన సమస్యలను నిర్ణీత వ్యవధిలోపు పరిష్కరించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. వివిధ సమస్యలపై 26 అర్జీలను ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను 94940 18118కు వాట్సాప్ ద్వారా లేదా 0861 – 2356777, 2316777 హెల్ప్‌లైన్ నంబర్లకు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరులోపు తెలియజేయాలని కోరారు. అదనపు కమిషనర్ నందన్, ఎంహెచ్ఓ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నమస్తే కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు కార్పొరేషన్లో రిజిస్టర్ చేసుకోవాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భూగర్భ డ్రైనేజీ కార్మికులకు రక్షణ ఉపకరణాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ విధుల్లో రక్షణ ఉపకరణాలను విధిగా ధరించాలని సూచించారు. నగరంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు సేకరించిన వ్యర్థాలను హరనాథపురంలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మాత్రమే అందించేలా చూడాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ పొందని వాహనాలను గుర్తిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. సెప్టిక్ ట్యాంక్ అవసరమైతే 14420ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



డీకేడబ్ల్యూ కళాశాలలో..



రత్నం స్కూల్లో..

నెల్లూరు (టౌన్): మనిషి జీవితాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని ఆర్ఐఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఎన్నెస్సెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ అజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీవీఈఓ మధుబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, అధ్యాపకులు వెంకట్రావు, చంద్రకళ, శ్రీదేవి, ప్రమీల, రమాదేవి, కృష్ణతులసి తదితరులు పాల్గొన్నారు.

- సరస్వతీనగర్‌లోని రత్నం స్కూల్లో అబుల్ కలామ్ అజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, పోస్టర్ తయారీ తదితరాలపై పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల, ప్రపూర్ణ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు వర్ధంతి



విద్యార్థికి బహుమతి ప్రదానం

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ నెల్లూరు నగర నాలుగో మహాసభను జరిపారు. విద్యారంగంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ గాంధీబొమ్మ కూడలి నుంచి పురమందిరం వరకు ప్రదర్శనను విద్యార్థులు నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఏఐడీఎస్ఓ నెల్లూరు నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా త్రినాథ్, కార్యదర్శిగా ప్రియ, సహాయ కార్యదర్శిగా రుత్విక్, కోశాధికారిగా థామ్సన్ మరో 12 మందితో కార్యవర్గం ఏర్పాటైంది. ఏఐడీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాహుల్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

15న కార్తీక దీపోత్సవం



ట్రయల్ రన్‌ను నిర్వహిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద కార్తీక దీపోత్సవాన్ని ఈ నెల 15న మహాద్భుతంగా నిర్వహించనున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 108 తెప్పలతో నిర్వహించనున్న శివాకృతి ఏర్పాట్లకు సంబంధించిన ట్రయల్ రన్‌ను సోమవారం నిర్వహించారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి నిర్వాహకులు డాక్టర్ వెన్నెల, జయప్రద, సురేంద్రరెడ్డి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు యత్నిస్తున్నారని, దీన్ని ప్రభుత్వమే భరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్లో గల గుర్రాలమడుగు సంఘంలో సోమవారం నిర్వహించిన ప్రజా పోరు యాత్రలో ఆయన మాట్లాడారు. బాదుడే బాదుడు అంటూ గతంలో ప్రచారం చేసి.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలను బాదుతోందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఉపసంహరించుకోపోతే వామపక్షాలతో కలిసి ఉద్యమాలు, ఆందోళనలను చేపడతామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇసుక ఉచితంగా అందడంలేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై కలెక్టరేట్ వద్ద మహాధర్నాను ఈ నెల 14న చేపట్టనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు నేతలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సూర్యనారాయణ, నరసింహ, పద్మ, మూలం ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో గ్రాండ్ పేరెంట్స్ డే



నెల్లూరు సిటీ: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో గ్రాండ్ పేరెంట్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకరయ్య మాట్లాడారు. విద్యార్థుల మానసిక వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. సీసీఏ కో ఆర్డినేటర్ అలివేలు మంగాబాయి, ప్రణీత, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దొరసానమ్మ, రవి, జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీశంకరుడికి రుద్రాభిషేకం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని కృష్ణ మందిర ప్రాంగణంలో కొలువైన భవానీ శంకరుడికి రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. కార్తీక సోమవార వ్రత విశిష్టతను ఉపన్యాసకుడు సాయికుమార్‌రెడ్డి తెలియజేశారు. భక్తులతో కార్తీక పురాణపఠనాన్ని జరిపారు. శివనామ భజనలతో మందిరం పులకించింది. మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, కమిటీ నిర్వాహకులు రాఘవేంద్ర, సుబ్బరామరాజు, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.